# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్.టి.ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 24 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 29 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :24 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 29 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## ఏనుగుల సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- చిత్తూరులో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి మళ్లించాలని పవన్ కల్యాణ్ ఆదేశం
- ఆపరేషన్ కోసం ముసలమడుగు నుంచి కుంకీ ఏనుగులను తీసుకురావాలని సూచన
- పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని స్పష్టం
- మానవ-ఏనుగు ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం

**పెన్ పవర్ డెస్క్:**చిత్తూరు జిల్లాలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న ఏనుగుల గుంపును వెంటనే అడవిలోకి సురక్షితంగా మళ్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముసలమడుగు శిబిరం నుంచి కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు. సోమవారం పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత 15 రోజులుగా 11 ఏనుగులతో కూడిన గుంపు, దాని నుంచి విడిపోయిన మరో రెండు ఏనుగులు పడిపుట్లబైలు పంచాయతీ పరిధిలోని పుండ్లవల్లపల్లి, నడింపల్లి, కొండకిందపల్లి గ్రామాల్లో సంచరిస్తున్నాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏనుగులు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఒక ఏనుగుల గుంపు రహదారి దాటి మంగళంపేట బీట్‌లోకి ప్రవేశించగా, మరో రెండు ఏనుగులు చిత్తూరు వైపు కదులుతున్నాయని

- మిగతా 2లో

# మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

- కుంచనపల్లిలో 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేశ్
- ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు అందించినట్లు వెల్లడి
- రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించినట్లు ప్రకటన
- వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని హామీ
- 2029 నాటికి నియోజకవర్గంలోని అర్హులందరికీ పట్టాలు అందిస్తామని లోకేశ్ వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**మంగళగిరి నియోజకవర్గంలో 80 శాతం పట్టాల సమస్య పరిష్కారమైందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కుంచనపల్లిలో 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా 372 మందికి ఉచితంగా ఇంటి పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన మెజారిటీ కారణంగానే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సొంత నిధులు కూడా ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు."ఇప్పటికే రెండు విడతల్లో 5,636 మందికి పట్టాలు ఇచ్చి రూ.2 వేల కోట్ల విలువైన భూములకు ఆస్తి హక్కులు కల్పించాం. మంగళగిరిలో పునాది వేసిన ఈ కార్యక్రమాన్ని విశాఖ,

- మిగతా 2లో

## ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

- మంత్రి లోకేశ్‌తో సమావేశమైన భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజయ్ రెడ్డి
- ఏపీలో అంధుల క్రికెట్‌ను బలోపేతం చేయడంపై కీలక చర్చ
- క్రీడాకారులకు పూర్తి మద్దతు ఇస్తామని లోకేశ్ భరోసా
- అంధ క్రికెటర్ల కోసం ప్రత్యేక మైదానాలు ఏర్పాటు చేస్తామని హామీ
- వారి ప్రతిభ, సంకల్పానికి అండగా నిలుస్తామన్న మంత్రి

- మిగతా 2లో





## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

- కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి వర్షాల అంచనా
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- రానున్న 72 గంటల్లో బంగ్లాదేశ్ వైపు తీరం దాటే సూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

- మిగతా 2లో




## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- నాలుగేళ్ల నిరంతర విద్య నిబంధన తప్పనిసరి అని పునరుద్ఘాటన
- స్థానికతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- రాష్ట్రపతి ఉత్తర్వులను, తెలంగాణ జీవోను సమర్థించిన న్యాయస్థానం

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి

- మిగతా 2లో

## జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- జగన్ పాలనలో బీసీలకు తీవ్ర ద్రోహం జరిగిందన్న మంత్రి కొల్లు రవీంద్ర
- బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని ప్రకటన
- 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారని వైసీపీ ప్రభుత్వంపై విమర్శ
- బీసీల అభ్యున్నతికి బడ్జెట్‌లో రూ.32,534 కోట్లు కేటాయించామని వెల్లడి
- కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణకు చిత్తశుద్ధితో ఉందని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**జగన్ ప్రభుత్వ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం

- మిగతా 2లో

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

### సచివాలయ ఉద్యోగుల డిమాండ్లపై మంత్రి స్వామి

- ఉద్యోగులను వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారని మంత్రి స్వామి ఆరోపణ
- అక్రమ ధర్నాలు, ఒత్తిళ్లు సహించేది లేదని హెచ్చరిక
- నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టీకరణ
- రెండు క్యాజువల్ లీవులకు ఉన్నతాధికారుల అనుమతి అవసరం లేదన్న మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే 15 వేల మందికి పైగా ప్రమోషన్లు ఇచ్చామని, సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అక్రమంగా ధర్నాలు చేస్తే సహించేది లేదని

- మిగతా 2లో



## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

**పెన్ పవర్ డెస్క్:** సీబీఎస్ఈ బోర్డు పరిధిలో ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఏడాది 7, 8, 9వ తరగతి విద్యార్థులకు కల్పించినట్లుగానే ఈ విధానం నుంచి ఆరో తరగతికి కూడా మినహాయింపు ఇవ్వాలని ఆదేశించింది. 2027 ఏప్రిల్ 1 నుంచి త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సూచించింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానంలోని అంశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. అకస్మాత్తుగా సీబీఎస్ఈ భాషా విధానం మార్చడంపై సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఇప్పటికే ఇతర భాషలు ఎంచుకున్న విద్యార్థులు మధ్యలో మరో భాషకు మారాలంటే ఇబ్బంది పడే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఈ విషయంపై పిటిషన్ దాఖలు చేసిన పాఠశాలలను

- మిగతా 2లో

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ.. అక్టోబర్ 15 నుంచి అమలు

- యూపీఐ లావాదేవీలపై 0.4% ఛార్జీల విధింపుపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ
- అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధనల అమలుకు మార్గం సుగమం
- రూ.2,000 దాటిన మర్చంట్ చెల్లింపులపై మాత్రమే ఈ ఛార్జీ వర్తింపు
- సాధారణ, వ్యక్తిగత లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టత
- ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలని కేంద్రం, ఆర్‌బీఐకి కోర్టు నోటీసులు

**పెన్ పవర్ డెస్క్:**యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే నిర్దిష్ట లావాదేవీలపై 0.4% ఛార్జీలు విధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్న నేపథ్యంలో వాటిని నిలిపివేయాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై నేడు విచారణ చేపట్టింది. ఈ నిర్ణయంతో షెడ్యూల్ ప్రకారమే కొత్త ఛార్జీల అమలుకు మార్గం సుగమమైంది.ప్రధాన న్యాయమూర్తి

- మిగతా 2లో



## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

- హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం
- అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ముఠా సభ్యుల వీడియోలు
- కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు
- సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు

2లో



## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

- ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు
- నవంబర్ 1 నుంచి రెట్టింపు కానున్న పార్కింగ్ ఛార్జీలు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు
- నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిగా నిషేధం
- ఫిబ్రవరి 28 వరకు అమలులో ఉండనున్న నిబంధనలు

- మిగతా 2లో



## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

- 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం
- మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం
- కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## జనసేన దూకుడు.. బలం ఎవరిది ఎంతో తెలుస్తుందా?

జనసేన ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల షేరింగ్ పై పట్టుబట్టే అవాకశముంది. లేదంటే స్నేహపూర్వక పోటీ చేస్తామని బహిరంగంగానే ప్రకటించింది. ఈ నేపథ్యంలో జనసేన డిమాండ్లకు టీడీపీ నుంచి సానుకూలత వస్తుందా? లేదా? అన్నది కూడా ఏపీలో చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రాంతాల వారీగా పటిష్ట వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఎ జనసేన నిర్ణయించింది. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరియు రాజకీయ వ్యవహారాల కమిటీ మార్గదర్శకాల ప్రకారం జనసేన అనుసరిస్తున్న ప్రధాన వ్యూహాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు కూటమిలోని మిత్రుల మధ్య చర్చనీయాంశమైంది. ఎక్కువ మంది టీడీపీ ఎమ్మెల్యేలున్నారు. వారు తమ నియోజకవర్గం పరిధిలో జనసేనకు వాటా ఇచ్చేందుకు అంగీకరించరు. హైకమాండ్ బలవంతం పై బయటకు అంగీకరించినా ఎన్నికల్లో మనస్ఫూర్తిగా పనిచేయరు.

**టీడీపీ, జనసేన సోషల్ మీడియా వార్...**

జనసేన పార్టీ తమకు ప్రాధాన్యత కల్పించకపోతే పోటీకి దిగుతామని ప్రకటించింది. అయితే పోటీకి దిగితే ఎవరి బలం ఏంటో బయటపడుతుందని కొందరు టీడీపీ అభిమానులు సోషల్ మీడియా వేదికగా అప్పుడే జనసేన పై కామెంట్స్ చేస్తున్నారు. 2014, 2024 ఎన్నికల్లో కూటమి గెలుపునకు తామే కారణమని చెప్పుకుంటూ తిరుగుతున్న జనసేన నోరు మూయించాలంటే ఒకరకంగా ఒంటరిగా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనిస్తే అసలు బలం తెలుస్తోందని కొందరు నేరుగా కామెంట్స్ పెడుతున్నారు. దీంతో రెండు పార్టీల మధ్య సోషల్ మీడియా వార్ మొదలయినట్లే కనిపిస్తుంది. ఒకవేళ హైకమాండ్ నిర్ణయం తీసుకున్నా క్షేత్రస్థాయిలో కలసి పనిచేసే అవకాశాలు మాత్రం ఒకరికొకరు కనిపించని పరిస్థితి అల్రెడీ ఇప్పటికే ఏర్పడిందన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇది వైసీపీకి కొంత మేరకు ప్రయోజనం చేకూరుతుందన్న భయం ఉన్నప్పటికీ ఎవరి బలం? ఏంటో తెలిస్తేనే ..గుప్పిట తెరిస్తేనే కదా? అంటున్నారు టీడీపీ నేతలు. ఇలా స్థానిక సంస్థల ఎన్నికలలో మిత్రుల మధ్య కొంత గ్యాప్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**జనసేన మాత్రం ముందుకే...**

మరొకవైపు జనసేన ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేసింది. స్థానిక ఎన్నికల నిర్వహణ, సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను నియమించారు.పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఈ కమిటీలు పనిచేస్తాయి.గ్రామ, వార్డు స్థాయిల్లో పార్టీ యంత్రాంగాన్ని ఇవి బలోపేతం చేస్తాయి. అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా కాకుండా, స్థానిక పరిస్థితులకు తగినట్లుగా వ్యూహం మార్చారు.ప్రతి ప్రాంతంలో పార్టీ సామాజిక, సంస్థాగత బలాలను అంచనా వేస్తున్నారు.గ్రౌండ్ రియాలిటీ ఆధారంగా పోటీ చేసే స్థానాలను ఖరారు చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన మేయర్ మరియు కీలక స్థానాలపై జనసేన ప్రత్యేక దృష్టి పెట్టింది.పోటీ చేసే ప్రతి చోటా విజయమే లక్ష్యంగా శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు.కూటమి సమన్వయంకూటమి భాగస్వామ్య పక్షాలతో సమన్వయ కమిటీల ద్వారా చర్చలు జరుపుతున్నారు.సీట్ల సర్దుబాటు మరియు కేటాయింపులపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుదినిర్ణయంగా ఉంటుందని స్పష్టం చేశారు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

## హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

## 'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు.బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్చరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు.

అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు.అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫొటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# జగన్ పాలనలో బీసీలకు ద్రోహం

- మొదటి పేజి తరువాయి

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో బీసీలను వెన్నుపోటు పొడిచిన వైసీపీ నాయకులు, ఇప్పుడు దొంగ నాటకాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు.

వైసీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా అణగదొక్కే ఉద్దేశంతోనే స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందని మంత్రి ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16,800 మంది బీసీలు తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తమ ప్రభుత్వం బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి, అందుకు అనుగుణంగా కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టాన్ని" తీసుకురానున్నట్లు కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా ప్రకటించారు. నారా లోకేశ్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే ఈ చట్టానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల

అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో రూ.32,534 కోట్లను కేటాయించిందని, వారి ఆర్థిక స్వావలంబన కోసం పటిష్ఠమైన చర్యలు తీసుకుంటోందని వివరించారు. జగన్ పాలనలో బీసీలపై దాడులు జరిగినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం మత్స్యకారులు, చేనేత కార్మికులు, వడ్డెరలు వంటి అన్ని వర్గాలకు ప్రత్యేక పథకాల ద్వారా భరోసా కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం.. అంధుల క్రికెట్‌కు మంత్రి నారా లోకేశ్ భరోసా

ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. భారత అంధుల క్రికెట్ జట్టుకు మూడు ప్రపంచకప్‌లు అందించిన మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి సోమవారం మంత్రి లోకేశ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అంధుల క్రికెట్ ఎదుర్కొంటున్న సవాళ్లు, క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.ఈ భేటీ అనంతరం మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అజయ్ కుమార్ రెడ్డిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో అంధుల క్రికెట్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్ర, దేశ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు మద్దతుగా నిలవడం, ప్రత్యేకించి దృష్టి లోపం ఉన్న క్రికెటర్ల కోసం ప్రత్యేక క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలపై చర్చించాం" అని లోకేశ్ తెలిపారు.

అంధ క్రీడాకారుల ప్రతిభ, అకుంఠిత దీక్ష, వారు సాధించిన విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. "వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. అజయ్ రెడ్డి వంటి క్రీడాకారులతో నేరుగా చర్చించి, ప్రభుత్వపరంగా పూర్తి మద్దతు ప్రకటించడం పట్ల రాష్ట్రంలోని అంధ క్రీడా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## మంగళగిరిలో 372 మందికి ఇంటి పట్టాలు పంపిణీ

- మొదటి పేజి తరువాయి

విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నాం. వచ్చే ఏడాది 100 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తాం. రానున్న ఎన్నికల్లోగా ప్రతి ఇంటికీ తాగునీరు, భూగర్భ డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తాం. కేంద్రం పరిధిలోని భూముల సమస్యలపై కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులందరికీ పట్టాలు అందిస్తాం" అని లోకేశ్ తెలిపారు.

## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

- మొదటి పేజి తరువాయి

సంప్రదించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు.

## కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. నవంబర్ 1 నుంచి కఠిన నిబంధనలు

ప్రతి ఏటా శీతాకాలంలో తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వం ముందస్తు నియంత్రణ చర్యలకు ఉపక్రమించింది. కాలుష్య తీవ్రతను తగ్గించే లక్ష్యంతో 2026 నవంబర్ 1వ తేదీ నుంచి కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా పార్కింగ్ ఛార్జీలను రెట్టింపు చేయడంతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

కొత్త నిబంధనల ప్రకారం, నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కేవలం 50 శాతం సిబ్బందితోనే కార్యకలాపాలు సాగించాలి. మిగిలిన 50 శాతం మంది ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు, నగర వ్యాప్తంగా భవన నిర్మాణ, కూల్చివేత పనులపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించింది. వాహనాల వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ కాలంలో పార్కింగ్ ఫీజులను కూడా రెట్టింపు చేయనున్నట్లు వెల్లడించింది.

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాలలో పంట వ్యర్థాలను కాల్చడం, వాహన కాలుష్యం, నిర్మాణ రంగ ధూళి, దీపావళి బాణసంచా, పారిశ్రామిక ఉద్గారాల వంటి కారణాలతో ఢిల్లీ నగరం ప్రతి ఏటా గ్యాస్ ఛాంబర్‌ను తలపిస్తోంది. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు బారిన పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ చర్యల ద్వారా శీతాకాలంలో కాలుష్య తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది.ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## యూపీఐ ఛార్జీలపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ.. అక్టోబర్ 15 నుంచి అమలు

- మొదటి పేజి తరువాయి

సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఛార్జీల విధింపుపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా ఈ కొత్త ఛార్జీల విధింపునకు గల ప్రాతిపదికను వివరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోరింది.

**కొత్త నిబంధనల ప్రకారం ఛార్జీల స్వరూపం**

సెప్టెంబర్‌లో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, వ్యక్తుల నుంచి వ్యాపారులకు (పీ2పీ) చేసే రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై 0.4% 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) వర్తిస్తుంది. రూ.75,000, ఆపైబడిన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 ఛార్జీ ఉంటుంది. అయితే, ఈ ఛార్జీల ప్రభావం సాధారణ వినియోగదారులపై ఎక్కువగా ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఎవరికి మినహాయింపు?**

వ్యక్తుల మధ్య (పీ2పీ) జరిగే యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు.

వ్యాపారులకు చేసే రూ.2,000 లోపు చెల్లింపులు పూర్తిగా ఉచితం.

యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు సున్నా-ఎండీఆర్ నిబంధన వర్తిస్తుంది.

అత్యావసర సేవలకు ఫ్లాట్‌గా రూ.5, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు 0.02% చొప్పున తక్కువ ఛార్జీలు వర్తిస్తాయి.

**ఇది పన్ను కాదు, సెటిల్‌మెంట్ ఫీజు: కేంద్రం**

కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ,

ఈ కొత్త ఛార్జీల వల్ల దాదాపు 96% మర్చంట్ లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను కాదని, కేవలం పేమెంట్ సిస్టమ్‌లో భాగమైన ఒక సెటిల్‌మెంట్ ఫీజు మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఛార్జీలు నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయరని ఆయన వివరించారు. ప్రస్తుతం స్టే ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, కేంద్రం ఇచ్చే వివరణ అనంతరం సుప్రీంకోర్టు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుంది.

## ఏనుగుల సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

అధికారులు పేర్కొన్నారు. ఈ ఏనుగుల సంచారం వల్ల పాకాల, పులిచెర్ల, చంద్రగిరి మండలాల ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, మానవ-ఏనుగు ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. "ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అటవీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖలు, హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేయాలి. క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం నిఘా ఉంచి, ప్రమాదం పొంచి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు.ఏనుగుల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకుంటూనే, ఏనుగులను సురక్షితంగా తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల భద్రత, పంటల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఉద్ఘాటించారు.

## 15 వేల ప్రమోషన్లు ఇచ్చాం.. ఇంకా ధర్నాలెందుకు?

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా హెచ్చరించారు.సోమవారం అమరావతిలో మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. గత ప్రభుత్వం సరైన సర్వీస్ రూల్స్ లేకుండా నోటిఫికేషన్లు ఇచ్చిందని, తమ ప్రభుత్వం వాటిని సరిదిద్దిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సచివాలయ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించినట్లు వివరించారు. దీనిలో భాగంగా రెండు క్యాజువల్ లీవులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వాడుకునే వెసులుబాటు కూడా కల్పించామని చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనల వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ జరుపుతామని చెబుతూనే, ఈ ఆందోళనలకు జగనే కారణమని మంత్రి స్వామి ఆరోపించారు. "గతంలో రూ.15,000 జీతానికి రెండేళ్లు పనిచేసినప్పుడు నిరసన తెలపని వారు, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. గత పీఆర్సీలో వీరిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?" అని నిలదీశారు.

కొన్ని డిమాండ్లపై మంత్రి స్పష్టత ఇచ్చారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఎవరికీ ఇవ్వడం సాధ్యం కాదని, కాబట్టి సచివాలయ ఉద్యోగులకు కూడా ఇవ్వలేమని తేల్చిచెప్పారు.ద

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగానే చూస్తున్నామని, గత ప్రభుత్వం నియమించిందన్న వివక్ష తమకు లేదని అన్నారు. వారి కోసం ప్రత్యేకంగా ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేసిందే తమ ప్రభుత్వమని గుర్తుచేశారు. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అయితే ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన

బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దీని ప్రభావంతో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది.

మయన్మార్, అండమాన్ దీవుల సమీపంలో ఏర్పడిన ఈ వాయుగుండం, ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కు 580 కిలోమీటర్ల దూరంలో తూర్పు-ఈశాన్య దిశలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా బంగ్లాదేశ్ వైపు కదులుతోంది. రానున్న 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి, సుమారు 72 గంటల్లో బంగ్లాదేశ్ తీరాన్ని తాకవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఈ వాయుగుండం ప్రభావంతో ప్రభావిత ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవలే ఉత్తరాంధ్ర తీరంలో కళింగపట్నం వద్ద ఒక తీవ్ర వాయుగుండం తీరం దాటడంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగిన నేపథ్యంలో తాజా హెచ్చరిక ప్రాధాన్యత సంతరించుకుంది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# 36వ వార్డులో జనసేనలో చేరికలు

**వైసీపీ నుంచి పలువురు ముస్లిం కుటుంబాల చేరిక**

**ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో పార్టీ కండువాలు**





**విశాఖ దక్షిణం, పెన్ పవర్ సెప్టెంబర్ 28 :** విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 36వ వార్డుకు చెందిన పలువురు ముస్లిం కుటుంబాల సభ్యులు, పవన్ కళ్యాణ్ అభిమానులు జనసేన పార్టీలో చేరారు. వీరిలో వైసీపీకి చెందిన పలువురు ఉన్నట్లు జనసేన నాయకులు తెలిపారు. 36వ వార్డు జనసేన అధ్యక్షుడు పి. శ్రీనివాస్ గౌడ్, వార్డు ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ షారుఖ్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ నూతనంగా పార్టీలో చేరిన వారికి జనసేన కండువాలు కప్పి ఆహ్వానించారు. మహమ్మద్ ముస్తాక్, అబ్దుల్ సలాం, ఎం.డి. ఆరిజి, ఎం.డి. ఫౌజర్, ఎస్. లక్ష్మి, జి. జ్యోతి, ఎస్.కె. షబానా, ఎం.డి. నసీమ, ఆర్. నారాయణరావు, వెంకట రమణ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి. శివప్రసాద్ రెడ్డి, 36వ వార్డు సీనియర్ నాయకుడు జెర్రీ పోతుల ప్రసాద్‌తో పాటు వార్డు నాయకులు, యువత, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం

**వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి**

**'ఉల్లాస్ అక్షరాంధ్ర' మూడో విడతకు 1.50 లక్షల పుస్తకాలు**

**జిల్లాలో 1.01 లక్షల మంది అభ్యాసకుల నమోదు**

**100 రోజుల పాటు చదవడం, రాయడం, గణితంపై శిక్షణ**

**జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్**



**అనకాపల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 28 :** జిల్లాలో నిరక్షరాస్యతను నిర్మూలించి వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. 'ఉల్లాస్ అక్షరాంధ్ర' కార్యక్రమంలో భాగంగా మూడో విడతకు సంబంధించిన అధ్యయన సామగ్రి, పుస్తకాలను సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడో దశలో అభ్యాసకుల కోసం 1,50,109 పుస్తకాలు జిల్లాకు చేరాయని తెలిపారు. ఇప్పటివరకు 1,01,653 మంది అభ్యాసకులు అక్షరాంధ్ర యాప్‌లో నమోదు చేసుకున్నారని వెల్లడించారు. నమోదైన ప్రతి వయోజనుడినీ అక్షరాస్యుడిగా తీర్చిదిద్దేలా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

పట్టణాలు, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గుర్తించిన వాలంటీర్ ఉపాధ్యాయుల ద్వారా 100 రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు చదవడం, రాయడం, గణితంతో పాటు రోజువారీ జీవితానికి అవసరమైన అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత అంశాల్లో బోధన, సాధన నిర్వహించాలని ఆదేశించారు.

మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఏపీఎంలు, ఏపీఓలు కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని, మున్సిపల్ కమిషనర్లు, అనకాపల్లి జోనల్ కమిషనర్ తమ పరిధిలో నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. వయోజన విద్య సహాయ సంచాలకుడు జిల్లా స్థాయిలో కార్యక్రమ పురోగతిని పర్యవేక్షిస్తూ శతశాతం అక్షరాస్యత సాధనకు కృషి చేయాలని ఆదేశించారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు పూర్తిస్థాయి పరిష్కారం చూపాలి

- రీ-ఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలి
- చర్యలపై స్పష్టమైన ఎండార్స్‌మెంట్ తప్పనిసరి
- పీజీఆర్ఎస్‌లో 268 వినతులు.. అధికారులకు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు






**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించి, అవి తిరిగి రీ-ఓపెన్ కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదుల పరిష్కార తీరును కలెక్టర్ సమీక్షించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ప్రజలకు సంతృప్తి కలిగేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదులను కేవలం క్లోజ్ చేయడానికే పరిమితం కాకుండా, తీసుకున్న చర్యల వివరాలతో సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని స్పష్టం చేశారు.

సర్వీస్ కేటగిరీ ఫిర్యాదులతో పాటు పదేపదే రీ-ఓపెన్ అవుతున్న వినతులను ప్రత్యేకంగా విశ్లేషించి, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రీ-ఆడిట్ ప్రక్రియ కూడా సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాల్లో పీజీఆర్ఎస్ ఒకటని, ప్రజల్లో ప్రభుత్వ సేవలపై సానుకూల అభిప్రాయం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 268 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెవెన్యూ క్లినిక్‌కు 14, జీవీఎంసీకి 58, పోలీసు శాఖకు 31, ఇతర శాఖలకు 165 ఫిర్యాదులు నమోదయ్యాయి.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, అదనపు కమిషనర్ రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## బీచ్ రోడ్డుపై ఆకతాయిల హల్‌చల్!

- అర్ధరాత్రి బైక్ విన్యాసాలు.. వేగపు పోటీలతో రచ్చ
- రంగంలోకి త్రీటౌన్ పోలీసులు.. 46 వాహనాలు స్వాధీనం
- ఆర్కే బీచ్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో ప్రత్యేక తనిఖీలు
- ముగ్గురితో ప్రయాణించిన 20 వాహనాలు పట్టివేత
- మద్యం మత్తులో వాహనాలు నడిపిన 14 మంది
- పోలీసులను చూసి వాహనాలు వదిలి పరారీ
- నిఘా కెమెరాల దృశ్యాలతో పరారైన వారి గుర్తింపు
- రోడ్లపై రచ్చ చేస్తే ఉపేక్షించేది లేదన్న సీఐ అమ్మినాయుడు






# ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్త గుర్తింపు కార్డులు కలిగి ఉండాలి.

**హుకుంపేట మండలంలో ప్రతి గ్రామపంచాయతీ కి వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో వైసీపీ గుర్తింపు ఐడి కార్డ్స్ పంపిణీ**



**హుకుంపేట పెన్ పవర్ సెప్టెంబర్28 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం సూచనలతో హుకుంపేట మండల వైసీపీ అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో మండల వైసీపీ శ్రేణులకు గుర్తింపు. కార్డులను పంపిణీ కార్యక్రమం చేశారు హుకుంపేట మండలం శోభకోట పంచాయతీ చిలకలపూట్టు గ్రామంలో మరియు మట్టం పంచాయతీ బొడ్డపూట్టు గ్రామంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తిరి రవిప్రసాద్, మాజీ ఉపాధ్యక్షులు పాంగి సింహాచలం హుకుంపేట మండలం బి ఎల్ ఓ అధ్యక్షులు రేగం రమేష్, అరకు నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు సమిడ. వెంకట పూర్ణిమ, ఉపాధ్యక్షులు కాకరి వెంకటరావు, శోభకోట గ్రామపంచాయతీ అధ్యక్షులు వెంకట్, మట్టం పంచాయతీ అధ్యక్షులు రేగం సత్యారావు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థాయి ప్రతినిధులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు గుర్తింపు కార్డులను అందజేశారు కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉండాలి అనే లక్ష్యంతో ఈ కార్డుల పంపిణీ చేపట్టినట్లు నిర్వహుకులు తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులను మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు, కార్యకర్తల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు కార్యకర్తే పార్టీకి బలం. కార్యకర్తల ఐక్యతే పార్టీకి అండ. ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు. ఐక్యంగా. సమన్వయంతో. ముందుకు. హుకుంపేట వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం. పార్టీ కార్యాచరణలో కొత్త జోష్. పాంగి అనిల్

హుకుంపేట మండల వైసీపీ అధ్యక్షుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే బలం. ప్రజలే లక్ష్యం అని అన్నారు

# జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన సదస్సు

**పిల్లల ఆరోగ్య పరిరక్షణకు నులిపురుగుల నివారణ అత్యంత అవసరం**



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 28:**అంగన్వాడీ కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,పాల్గొన్నారు. ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తల సహకారంతో చిన్నారుల తల్లిదండ్రులకు నులిపురుగుల వల్ల కలిగే దుష్ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పిల్లల ఎదుగుదలకు నులిపురుగుల నివారణ తప్పనిసరి అన్నారు. వైద్యుల సూచన మేరకు ఒకటి నుండి రెండేళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలో సగాన్ని పొడిచేసి నీటిలో కలిపి ఇవ్వాలని,రెండేళ్లు పైబడిన వారికి పూర్తి మాత్ర వేయాలని సూచించారు. చేతి గోర్లు కొరకడం,భోజనానికి ముందు చేతులు కడుక్కోకపోవడం,కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల నులిపురుగులు వ్యాపిస్తాయని, తల్లిదండ్రులు పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు,ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, యల్లమిల్లి సురేష్,నెల్లి అప్పారావు,మంగరాజు గణపతిరావు,ఏఎన్ఎంలు, ఆశాలు,అంగన్వాడీ టీచర్లు, ఆయాలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఐ

# సరమండ దద్దుగులుకు బీటీ రోడ్డు మంజూరు చేయండి

**శరభన్నపాలెం మాజీ ఉప సర్పంచ్ "సంపరి త్రిమూర్తులు"**



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 28 :** శరబన్నపాలెం పంచాయితీలో అతి మారుమూల గ్రామాలైన సరమండ, దద్దుగుల గ్రామాలకు బీటీ రహదారి మంజూరు చేయాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు కు వినతి పత్రం అందజేయడం జరిగిందని శరబన్న పాలెం మాజీ ఉప సర్పంచ్ సంపరి త్రిమూర్తులు తెలిపారు. సోమవారం నడింపాలెం పంచాయతీ బట్టు మెట్ట గ్రామానికి చెందిన వారు వైసీపీ పార్టీ లోకి చేయడంతో ఆ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో శరబన్నపాలెం రామకోవుల వద్ద ఎమ్మెల్యే ని కలిసి రహదారి నిర్మాణంపై వినతి పత్రం అందజేయడం జరిగిందని త్రిమూర్తులు తెలిపారు. అనేక ఏళ్లుగా ఎటువంటి రహదారి సౌకర్యం లేక అష్టకష్టాలు పడుతున్నారని ఇప్పటికైనా ఆదిమ జాతి గిరిజనులకు ప్రయోజనం చేకూర్చే విధంగా దద్దుగుల , సరమండ గ్రామాలకు బీటీ రహదారి మంజూరు చేయాలని కోరడం జరిగింది. అలాగే పంచాయతీకి సంబంధించి అనేక సమస్యలను కూడా వివరించడం జరిగిందని తెలిపారు. అదే గ్రామంలో జిపియుపి మోడల్ పాఠశాలలో ఎత్తైన వృక్షాలు తమ ఇళ్లపై పడిపోయే ప్రమాదం ఉందని వాటిని తొలగించాలని ఉపాధ్యాయులకుతెలియజేసిన స్పందించడం లేదని జల్లి రాజు అనే మహిళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు హామీ ఇచ్చారు

# వైసిపి పార్టీకి క్షేత్ర స్థాయిలో కార్యకర్తలే షాడోలు ...!





- **స్థానిక ఎన్నికల్లో వెన్నుపోటు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి.**
- **నాయకులు అందరు ఏకమై స్థానిక ఎన్నికల్లో మండలంలో విజయ బేరీ మోగించాలి**
- **కార్యకర్తలకు పార్టీ ఐడి కార్డులు అందజేసి దిశానిర్దేశం చేసిన శాసన సభ్యులు వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ అధ్యక్షులు "మత్స్యరాస విశ్వేశ్వర రాజు"**

**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 28:** మండల కేంద్రం గిరిజన భవన్ లో మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు ఐడి కార్డులు పంపిణీ చేసి స్థానిక సంస్థల ఎన్నికలు గురించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాని ఉద్దేశించి శాసన సభ్యులు మాట్లాడుతూ... మన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రెండేళ్లు కరోనా వల్ల గడిచిపోయిందిని మూడేళ్లు రాష్ట్ర పరిపాలనలో భాగంగా అభివృద్ధి, సంక్షేమం మీద దృష్టి పెట్టి కార్యకర్తలు నిరాశకు గురయ్యారని విషయం తెలుసుకుని జగనన్న కార్యకర్తలకు ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడి కార్డులు అందజేసే కార్యక్రమం శ్రీకారం చుట్టారని అన్నారు. మండలంలో ఉన్న సీనియర్ నాయకులు అందరు ప్రతి పంచాయితీ గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలకు ఐడి కార్డులు అందజేసి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చేసిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే ఈ వెన్నుపోటు ప్రభుత్వ హయాంలో చేసిన మోసాలు ప్రతి గ్రామంలో తెలియజేసి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నియమించిన అభ్యర్థులకు గెలిపించాలని శాసన సభ్యులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బదుగు రమేష్, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్, రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ జైతి రాజులమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రీమల గంగాధర్, రాష్ట్ర ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీ నీలాపు సూరిబాబు, జిల్లా కార్యదర్శి సుమర్ల సూరిబాబు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి పొట్టిక పోతురాజు, మాజీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ లు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, జీకే వీధి మండల పార్టీ అధ్యక్షుడు గిరి ప్రసాద్, తాజా మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...బి

# సచివాలయ ఉద్యోగులపై లాఠీఛార్జి తగదు.

**పోలీసులు, ప్రభుత్వ తీరుపై సీఐటీయూ నేతల ఆగ్రహం.**

**బాధిత ఉద్యోగుల ధర్మపోరాటానికి సంపూర్ణ మద్దతు.**



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 28.** న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కదం తొక్కిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడటం, అక్రమ అరెస్టులకు పాల్పడటం దారుణమని అల్లూరి జిల్లా సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం చింతపల్లిలో వారు విలేకరులకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిరసన తెలిపేందుకు ముందుగా పోలీసుల అనుమతి కోరినప్పటికీ, కావాలనే నిరాకరించి ఆ సాకుతోనే దారుణంగా లాఠీఛార్జికి తెగబడ్డారని వారు విమర్శించారు. పోలీసుల దాడిలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమైక్య అధ్యక్షురాలు అనురాధతో పాటు పలువురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పైగా, ఆందోళన సందర్భంగా జరిగిన తోపులాట వల్లే ఒక పోలీసు అధికారి మృతి చెందాడంటూ తప్పుడు కథనాలు సృష్టించి, సచివాలయ ఉద్యోగులపై అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ అధికారిని బలవంతంగా విధుల్లోకి ఎలా రప్పిస్తారని వారు ప్రశ్నించారు. ఆ పోలీసు అధికారి మృతికి ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలేమీ అడగడం లేదని, తమను వెట్టిచాకిరీ నుంచి విముక్తి చేయాలన్నదే వారి ప్రధాన డిమాండ్ అని నేతలు గుర్తుచేశారు. వారికి తక్షణమే నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతో పాటు, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, నిర్దిష్టమైన ప్రమోషన్ ఛానల్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు నష్టదాయకంగా ఉన్న జీవో నంబర్ 11ను తక్షణమే రద్దు చేయాలని, వారిపై మోపుతున్న అనవసరమైన సర్వేల భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, జీవో నంబర్ 5 ప్రకారం చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ న్యాయమైన కోర్కెలను అడగడంలో తప్పు ఏముందని ప్రశ్నించిన వారు.. ఉద్యోగులు చేస్తున్న ధర్మపోరాటానికి సీఐటీయూ అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రకటించారు. హక్కుల కోసం పోరాడుతున్న ఆందోళనకారులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే.. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత కూటమి ప్రభుత్వానికీ పడుతుందని చిన్నయ్య పడాల్, ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

# కూటమి పాలనపై విరక్తి చెంది టిడిపి, బిజెపి కి చెందిన 100 మంది వైసీపీలో చేరికలు

**కొండవాగు దాటుకొని బట్టు మెట్ట చేరుకున్న ఎమ్మెల్యే "మత్స్యరాస విశ్వేశ్వర రాజు"**

**ఎమ్మెల్యేకు బ్రాహ్మ రథం పట్టిన మహిళలు**



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 28:**కూటమి ప్రభుత్వం చేస్తున్న కుటిల రాజకీయాలపై విరక్తి చెందే వైఎస్ఆర్సిపి లోకి చేరికలు మొదలయ్యాయని, ఇది ఆరంభం మాత్రమేనని అల్లూరి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు అన్నారు. సోమవారం మండలంలో నడిం పాలెం పంచాయితీ బట్టుమెట్ట గ్రామానికి చెందిన 30 కుటుంబాలు సుమారు వందమంది వైఎస్ఆర్సిపి తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకు మహిళలు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హాయంలో జరిగిన సంక్షేమం అభివృద్ధి నేడు కూటమిపాలనలో జరగలేదని గ్రామస్తులంతా ఏకతాటిపై కి వచ్చి వైసీపీలో చేరారని పేర్కొన్నారు. ఏజెన్సీవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి కి ఆదరణ ఎక్కడ లేదని కానీ కొంతమంది నాయకులు వైఎస్ఆర్సిపి పై బురద జల్లుతూ ఇతర పార్టీలో చేరుతున్నారని అసత్య ప్రసాదాలు చేస్తున్నారన్నారు. మన్యంలో వైఎస్ఆర్సిపి బలం ఏంటో త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ప్రజలే తగిన సమాధానం ఇస్తారని ఆయన స్పష్టం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు అందరూ కష్టించి పనిచేయాలని సూచించారు. బట్టుమట్ట గ్రామస్తులు అందరికీ వైఎస్ఆర్సిపి వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు. ఏ సమస్య ఉన్న మండల నాయకత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తమ గ్రామానికి తీరని కలగా ఉన్న కొండ వాగుపై వంతెన నిర్మిస్తే జీవితాంతం రుణపడి ఉంటామని బట్టుమెట్ట గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరావు స్వయంగా శరబన్నపాలెం నుండి కాలినడకన కొండ వాగు దాటుకుంటూ కళ్ళారా చూసి బట్టు మెట్ట గ్రామానికి చేరుకోవడం జరిగిందని చూసానని ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సాధిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు, మాజీ ఎంపీపీ బదుగు రమేష్ బాబు, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, మాజీ సర్పంచులు ఫోరం అధ్యక్షుడు రేగటి ముసలి నాయుడు, వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు గాడి సత్యనారాయణ, వైసిపి యువజన నాయకుడు గొడ్డేటి మహేష్, మాజీ సర్పంచ్ కిముడు సత్యనారాయణ, బాలకృష్ణ, రీముల శ్రీను, చడ్డా రాజేశ్వరి, రీమల గంగాధర్, అచ్యుత్, సూరిబాబు, మాజీ వైస్ సర్పంచ్ సంపరి త్రిమూర్తులు, తో పాటు పార్టీలో చేరిన మాజీ వైస్ సర్పంచ్ దూరి రాజబాబు, దూరి దేముడు, దూరి సత్యవతి, పంద్ర చిట్టిబాబు, పాండా లక్ష్మి, సీత, సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు

# కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలి.

**చింతపల్లిలో కదం తొక్కిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది.**

**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 28.** వైద్య ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిన సేవలందిస్తున్న తమను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ శాఖ ఉద్యోగులు కదం తొక్కారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం చింతపల్లి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ బేషరతుగా క్రమబద్ధీకరించాలని, ఆ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు సిబ్బందికి నూరు శాతం గ్రాస్ వేతనాన్ని చెల్లించాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉండగా దురదృష్టవశాత్తూ ఏదేని ప్రమాదం జరిగి లేదా అనారోగ్యంతో ఉద్యోగి మరణిస్తే.. వారి కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని కోరారు. అలాగే, కాంట్రాక్టు సిబ్బందికి మెరుగైన ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు, ఉద్యోగుల సౌలభ్యం కోసం రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం కల్పించాలని విన్నవించారు. తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఈ ర్యాలీలో ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలకు చెందిన ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, రేడియో గ్రాఫర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఫ్ఎన్ఓలు, ఎంఎన్ఓలతో పాటు జిల్లా జేఏసీ నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున హాజరై తమ గళాన్ని వినిపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ శ్రమను గుర్తించి డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



# దేశానికి భగత్ సింగ్ సేవలు, త్యాగాలు మరువలేనివి.

**దేశ సేవకు ప్రతి ఒక్కరూ ముందుండాలి.**

**మూలగరువు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జయంతి వేడుకలు.**



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 28.** భారత స్వాతంత్ర్య సంగ్రామ విప్లవ వీరుడు, 'షహీద్-యే-ఆజమ్' భగత్ సింగ్ జయంతి వేడుకలను మూలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జలియన్‌వాలా బాగ్ ఉదంతం భగత్ సింగ్‌ను ఎంతగానో కలచివేసిందని, ఆ సంఘటనతోనే ఆయన బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటుకు సన్నద్ధమయ్యారని గుర్తుచేశారు. 'ఇంకిలాబ్ జిందాబాద్' అనే నినాదంతో బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించి, దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప త్యాగధనుడు భగత్ సింగ్ అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగాలను, దేశ సేవను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, భవిష్యత్తులో దేశాభివృద్ధికి ఉన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యు.వి.గిరి, కె.నాగమణి, జి.నవ్య, వి.స్వర్ణ, పి.లక్ష్మితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై అవగాహన







**ఆనందపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 28 :** మండలం లోని గొట్టిపల్లి గ్రామంలో వాసవ్య మహిళా మండలి (వీఎంఎం) ఆధ్వర్యంలో సంత్వనా కార్యక్రమంలో భాగంగా లైవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సహకారంతో మానసిక ఆరోగ్యంపై అవగాహన, అడ్వకసీ సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు, అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలకు తెలియజేయడం కార్యక్రమం ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి టీ. ప్రశాంత్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. వీఎంఎం ప్రాజెక్టు సమన్వయకర్త హేమ మానసిక అనారోగ్య రకాలు, లక్షణాలు, చికిత్సా విధానాలు, విశాఖపట్నంలో అందుబాటులో ఉన్న సేవలను వివరించారు. ప్రాజెక్టు పర్యవేక్షకుడు ఎం. నాగరాజు సంత్వనా కార్యక్రమం ద్వారా మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి అందిస్తున్న సేవలను వివరించారు.కార్యక్రమంలో ఆనందపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డబ్బీరు విజయ్ కుమార్, ఎంపీపీ మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. గోవింద్ , ఆర్ఎంపీ వైద్యులు, ఆరోగ్య, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సుమారు 30 మంది కీలక వ్యక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వీఎంఎం కమ్యూనిటీ యానిమేటర్లు రమణమ్మ, పావని సమన్వయం చేశారు.

## కరెంట్ షాక్‌తో లైన్‌మెన్ అసిస్టెంట్ దుర్మరణం.
## వెల్లంకిలో సంఘటన.



**ఆనందపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 28:** కరెంట్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన విషాద సంఘటన ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. జగన్నాథపురం గ్రామానికి చెందిన రెల్లి రవి(26) వెల్లంకిలోని ఇండో ఆక్వా కంపెనీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.శనివారం సాయంత్రం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో గ్రేడ్-×× జేఎల్ఎమ్ బొచ్చా అశోక్‌తో కలిసి తనిఖీకి వెళ్లాడు. హెచ్.జిఫ్యూజ్ పాడవ్వడంతో,మరమ్మత్తు కోసం ఏబీ స్విచ్ ద్వారా విద్యుత్ నిలిపివేశారు. స్విచ్‌లో ఏర్పడిన యాంత్రిక లోపం వల్ల ఒక బ్లేడ్ తెరుచుకోకపోవడంతో కరెంట్ సరఫరా ఆగలేదు. విషయం తెలియక హెచ్‌జీ ఫ్యూజ్ మార్చేందుకు స్తంభం ఎక్కిన రవి,లైవ్ వైరుకు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు.వెంటనే మధురవాడ కొమ్మాది లోని గాయత్రి ఆస్పత్రికి తరలించగా,అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మృతుడి భార్య సారికి ఊహ ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ వి.వి.సి.ఎమ్.ఎర్రం నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ పి.శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భీమిలి మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో నిరుద్యోగంపై పోరాడాలి

**యువత ఓటు హక్కును కాలరాయొద్దు.**

**ఆదివాసీ గిరిజన సంఘం నేత సాగిన చిరంజీవి.**



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 28.** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోనే యువతకు ఓటు హక్కు దక్కకుండా కుట్రలు జరుగుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి ఆరోపించారు. ఎన్నికల సంఘం ఫారం-6లో అభ్యంతరాలను పక్కనపెట్టి యువతకు తక్షణమే ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని గెర్రిలగడ్డ-పుల్లమామిడి వీధిలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం చిరంజీవి మాట్లాడారు. కొత్తగా 18 ఏళ్లు నిండిన యువత (జెన్-జీ) ఓట్ల నమోదు కోసం ఏటా చేపట్టే స్పెషల్ సమ్మరీ రివిజన్ను కొన్నేళ్లుగా నిలిపివేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 21 ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఎన్నికల సంఘం ప్రాథమిక రాజ్యాంగ బాధ్యత అని గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను ముద్దాడిన భగత్ సింగ్ త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆయన స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ నిరుద్యోగ విధానాలపై యువత ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెసా కమిటీ సెక్రటరీ అప్పలస్వామి, గిరిజన సంఘం నేతలు కిల్లో సింహాచలం, మజ్జి రాంబాబు, బురిడీ రఘురాం, జి.చిరంజీవి, గెమిల బాలన్న, జి.మల్లన్న, శ్రీదేవి, కే.మల్లేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

**పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 28 :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవ స్థ ద్వారా అందిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్క రించి, అవి తిరిగి రీ-ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు సంతృ ప్తికరమైన సేవలు అందించడం ప్రతి అధికారిపై ఉన్న బాధ్యత అని స్పష్టం చేశారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిం చిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుల పరిష్కార తీరు పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదుదారు లతో సంబంధిత శాఖల అధికారులు తప్పనిస రిగా మాట్లాడి సమస్యను పూర్తిగా అర్థం చేసుకో వాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నాణ్యమైన పరి ష్కారం అందించాలని ఆదేశించారు. ఫిర్యాదుల ను సక్రమంగా క్లోజ్ చేయడంతో పాటు, తీసుకు న్న చర్యలకు సంబంధించి సరైన ఎండార్స్‌మెం ట్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. పీజీ ఆర్ఎస్ ఫిర్యాదుల్లో సర్వీస్ కేటగిరీ, తరచూ రీ-ఓపెన్ అవుతున్న ఫిర్యాదులను విశ్లేషించి, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తెలిపారు. ప్రీ-ఆడిట్ ప్రక్రియ కూడా సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ టాప్-3 ప్రాధాన్యతల్లో పీజీఆర్ఎస్ ఒకటని పేర్కొన్న కలెక్టర్.. ప్రజల్లో ప్రభుత్వ సేవలపై సానుకూల అభిప్రాయం మరింత పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

**268 ఫిర్యాదుల స్వీకరణ**

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 268 ఫిర్యాదులు నమో దయ్యాయి. వీటిలో రెవెన్యూ క్లినిక్‌కు సంబంధిం చి 14, జీవీఎంసీకి 58, పోలీస్ శాఖకు 31, ఇతర శాఖలకు 165 ఫిర్యాదులు అందాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, అదనపు కమిషనర్ రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విశాఖలో అపోలో అధునాతన కమాండ్ సెంటర్ ప్రారంభం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబరు 28 :** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని అపోలో హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన అధునాతన కమాండ్ సెంటర్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు.




ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లా డుతూ.. సాంకేతికత ఆధారిత కనెక్టెడ్ కేర్ విధానంతో నిపుణుల వైద్య సేవలను వేగంగా, మరింత చేరువగా అందించేందుకు కమాండ్ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. స్మార్ట్ అంబులెన్స్, టెలి-ఈసీజీ, టెలిమెడిసిన్ వంటి సేవలను అనుసంధానం చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో రోగులకు త్వరితగతిన నిపుణుల వైద్య సలహాలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.విశాఖపట్నం ఆరో గ్యం, ఐటీ, పరిశ్రమలు, పెట్టుబడులకు కీలక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని ఆయన అ న్నారు. నగరంలో ప్రపంచస్థాయి వైద్య సదు పాయాలు అందుబాటులోకి రావడం వల్ల విశాఖ ప్రాధాన్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ప్రత్యేక వైద్య చికిత్సల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించేలా విశాఖలోనే అధునాతన వైద్య సేవలు అందుబా టులోకి రావడం అభినందనీయమని పల్లా శ్రీని వాసరావు అన్నారు. విశాఖను ఆరోగ్య హబ్‌గా అభివృద్ధి చేసే క్రమంలో ఆధునిక వైద్య మౌలిక సదుపాయాల విస్తరణ కీలకమని పేర్కొన్నారు.

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభు త్వం విశాఖ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, మౌలిక వసతులతో పాటు వైద్య రంగంలో ఆధునిక సదుపాయాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తోందని ఆయన తెలిపారు.

## "దామనపల్లిలో వైసీపీకి బిగ్ షాక్.. జనసేనలోకి భారీ చేరికలు!"

**మార్పు కోరుకుంటున్న దామనపల్లి వాసులు**





**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** గూడెంకొత్తవీధి మండలంలోని దామనపల్లి పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత జనసేన పార్టీలో చేరారు. దామనపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక చేరికల కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులతో పాటు 200మందికి పైగా జనసేన పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. దామనపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ కుటుంబ సభ్యులతో పాటు మాజీ ఎంపీటీసీ కుందేరి వీరమ్మ నాగరాజు జనసేన పార్టీలో చేరారు. వీరితో పాటు దామనపల్లి గ్రామంలోని మూడు వీధులకు చెందిన ప్రజలు, పంచాయతీ పరిధిలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత జనసేనలో చేరినట్లు పేర్కొన్నారు.అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ సారథ్యంలో, అల్లూరి జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్, రాష్ట్ర జానపద కళల అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆధ్వర్యంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. పార్టీలోకి కొత్తగా చేరిన వారికి గంగులయ్య, వీర వెంకట్ జనసేన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జనసేనలో చేరిన పలువురు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ చేస్తున్న కార్యక్రమాలు తమను ఆకర్షించాయని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధానం నచ్చడంతో వైసీపీని వీడి జనసేనలో చేరినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. దామనపల్లి పంచాయతీలో ఒకేసారి పెద్ద సంఖ్యలో చేరికలు జరగడం స్థానికంగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని జనసేన నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కొత్తగా చేరిన కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, జీకే వీధి మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, సిదరి రామమూర్తి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వసుపరి ప్రసాద్, సలిమితి రేణుక, కొయ్యం ఇమ్మానుయేల్, గబుళంగి గణేష్, వంశీ, శ్రీను, ఈశ్వర్, గడుతూరి పరమేశ్వరరావు, మదల సతీష్, సిదరి రమణమూర్తి,వెంకటేశ్వర్లు,కూడా పల్లం నాయుడు, వంతల కాశీరాజు, సూర్ల వీరేంద్ర, కూడా రామకృష్ణ, చల్లంగి శ్రీను, దాసు, సరస్వతిరావు, సీనియర్ నాయకులు కొర్ర రాంబాబు, పాంగి దాసు, సుందర్, తగ్గి బాలరాజు, భీమశంకర్ తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అల్లికలా పుట్టుకొచ్చిన అరుదైన పుట్టగొడుగు

**జీకేవీధి మండలంలో వింతగా కనిపించిన బ్రైడల్ వెల్ మష్రూమ్**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలతో అడవులు, కాఫీ తోటల్లో పుట్టగొడుగులు విరివిగా పుట్టుకొస్తున్నాయి. సాధారణంగా చిన్న గొడుగుల ఆకారంలో కనిపించే పుట్టగొడుగులకు భిన్నంగా జీకేవీధి మండలంలోని కంపుమానుపాకల గ్రామంలో ఓ అరుదైన పుట్టగొడుగు దర్శనమిచ్చింది. కంపుమానుపాకల గ్రామానికి చెందిన రైతు భూపతి తన కాఫీ తోటలో ఈ వింత ఆకారంలో ఉన్న పుట్టగొడుగును గుర్తించారు. సాధారణ పుట్టగొడుగులకు భిన్నంగా అల్లిక మాదిరిగా, తెల్లటి సన్నని తంతువులతో విస్తరించి కనిపించడంతో స్థానికులను ఆకర్షించింది.ఈ పుట్టగొడుగును 'బ్రైడల్ వెల్ మష్రూమ్' అని పిలుస్తారని ఉద్యానవన శాఖ మండల అధికారిణి అరుణకుమారి తెలిపారు. జన్యుపరమైన కారణాల వల్ల కొన్ని పుట్టగొడుగులు సాధారణ ఆకృతికి భిన్నంగా ఇలా ఏర్పడే అవకాశం ఉందని ఆమె వివరించారు.వర్షాకాలంలో తేమ అధికంగా ఉండటంతో మన్యం ప్రాంతంలోని అడవులు, తోటల్లో వివిధ రకాల పుట్టగొడుగులు వెలుగులోకి వస్తుంటాయని అధికారులు తెలిపారు. కంపుమానుపాకల కాఫీ తోటలో కనిపించిన ఈ అరుదైన పుట్టగొడుగు స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది.

## భవిష్యత్తు ఓటర్లు భాగస్వాములు కావాలి
## జీకేవీధిలో ముమ్మరంగా స్వీప్ కార్యక్రమాలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జీకేవీధి తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు, ఎంపీడీవో బి హెచ్ వి రమణ బాబు పిలుపునిచ్చారు. మండలంలో ఓటర్ల అవగాహన, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్) కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, ఏపీటీడబ్ల్యూ జూనియర్ కళాశాల, దేరాల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, భవిష్యత్తు ఓటర్లుగా యువత ప్రజాస్వామ్య బలోపేతంలో కీలక పాత్ర పోషించాలని అధికారులు సూచించారు.ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నైతిక విలువలతో ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఎన్నికలకు వైసీపీ సమరభేరి

- ప్రతి వార్డులో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు కసరత్తు
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకే వెళ్లాలని నిర్ణయం
- తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యంపై ఉద్యమాలకు కార్యాచరణ
- వార్డుల పునర్విభజన పారదర్శకంగా జరగాలని డిమాండ్
- విశాఖ భూములు, పర్యావరణ పరిరక్షణపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం



**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** రాబోయే గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమరానికి సిద్ధమవుతోంది. ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండే, గెలుపు సామర్థ్యం కలిగిన బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు కసరత్తు ప్రారంభించింది. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తూ క్షేత్రస్థాయిలో ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది.
మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్డులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు అధ్యక్షతన జీవీఎంసీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎంపీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు పాల్గొన్నారు.రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, వార్డుల వారీగా పార్టీ పరిస్థితి, అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణుల సమన్వయం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని స్థాయిల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసి ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు నేతలు తెలిపారు.

### ప్రజా సమస్యలే ప్రధాన అస్త్రం

విశాఖలో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, పౌర సేవల సమస్యలను ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగర అభివృద్ధి మందగించిందని వైసీపీ నేతలు ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బకాయిలు, రహదారులపై గుంతలు, పారిశుధ్య లోపాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.
ముఖ్యంగా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులకు ఒకసారి మంచినీరు అందుతున్న పరిస్థితి ఉందని ఆరోపించారు. నగర జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా దీర్ఘకాలిక తాగునీటి ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ భూములను కాపాడాలి

విశాఖలోని విలువైన ప్రభుత్వ భూములు, ఆస్తుల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని వైసీపీ నేతలు కోరారు. గీతం విద్యాసంస్థ పరిధిలోని 54 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంతో పాటు మధురవాడ, ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల పరిస్థితిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తులు వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

### కొండల పరిరక్షణపై పోరాటం

విశాఖ పరిసర ప్రాంతాల్లో కొండల తవ్వకాలు, అక్రమ మైనింగ్ జరుగుతున్నాయంటూ సమావేశంలో నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పంచదార్ల కొండ, బావికొండ, సింహాచలం కొండల పర్యావరణ, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీపడబోమని, అవసరమైతే ప్రజా ఉద్యమాలు చేపడతామని ప్రకటించారు.

### వార్డుల పునర్విభజనపై నిఘా

జీవీఎంసీ వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. డివిజన్ల మధ్య ఓటర్ల సంఖ్యలో భారీ వ్యత్యాసాలు లేకుండా జనాభా సమతుల్యత, భౌగోళిక అనుసంధానం, సామాజిక సమగ్రత, పరిపాలనా సౌలభ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పునర్విభజనపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నామని, అవసరమైతే న్యాయపరమైన మార్గాలను ఆశ్రయిస్తామని తెలిపారు.
ఎన్నికల ప్రక్రియలో అధికారులు, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కూడా నేతలు కోరారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు.

### బలమైన అభ్యర్థుల కోసం కసరత్తు

ప్రతి వార్డులో ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులను గుర్తించి అభ్యర్థులుగా ఎంపిక చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. స్థానికంగా ప్రజాదరణ, ప్రజా సమస్యలపై అవగాహన, పార్టీతో అనుబంధం, ఎన్నికలను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలను అభ్యర్థుల ఎంపికలో పరిగణనలోకి తీసుకోనున్నట్లు నేతలు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, ధరల పెరుగుదల, ప్రభుత్వ భూముల రక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. విశాఖ నగర భవిష్యత్తు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రకటించారు.





# 180 కేజీల అన్నమయ్య లడ్డూకు రూ.3 లక్షల ధర

**వేలం పాటలో దక్కించుకున్న మాజీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్**





**ఆనందపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 28:** వేములవలస గ్రామంలో వాయుపుత్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా 180 కేజీల భారీ అన్నమయ్య లడ్డూకు వేలం పాట నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేలం పాటకు గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.లడ్డూ వేలం పాటను రూ.72 వేల ప్రారంభ ధరతో ప్రారంభించగా పోటీ ఆసక్తికరంగా సాగింది. చివరకు వేములవలస మాజీ ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ రూ.3 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.వేలం పాటలో రెండో స్థానంలో నాచు గౌరీ రూ.2.90 లక్షలు, మూడో స్థానంలో కోరాడ వెంకటేష్ రూ.2.80 లక్షలు పలికారు. అలాగే నాలుగో స్థానంలో కొట్యాడ శ్యామ్ కుమార్, తుమ్మగంటి శశి కుమార్, చందక సతీష్ కుమార్ రూ.2.70 లక్షల వరకు వేలం పాటలో పాల్గొన్నారు.భక్తి, ఐక్యత, సంప్రదాయాలకు ప్రతీకగా సాగిన ఈ వేలం పాట గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీ లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది. అనంతరం స్వామి వారి ఊరేగింపు ఆధ్యాత్మికంగా వాయుపుత్ర యూత్ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# కంపుమానుపాకల వద్ద కూరగాయల ఆటో బోల్తా

**తప్పిన పెను ప్రమాదం.. ఎవరికీ గాయాలు కాలేదు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**జీకేవీధి మండలం కంపుమానుపాకల సమీపంలో సోమవారం సాయంత్రం కూరగాయల ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. మైదాన ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి గ్రామాల్లో కూరగాయలు విక్రయించేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో అదుపుతప్పి రహదారి పక్కకు బోల్తా పడినప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా వాహనాలు నడపాలని అధికారులు సూచించారు.

# విద్యార్థులు దీర్ఘకాలిక లక్ష్యాలతో చదువుకోవాలి

## కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం




**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** డిగ్రీ విద్యార్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను ముందుగానే తెలుసుకుని, దీర్ఘకాలిక లక్ష్యాలతో చదువుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాథూరు సూచించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్ సెల్ సభ్యుడు డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించిన ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లను విద్యార్థులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. విద్యాభ్యాస దశ నుంచే తమ కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని తెలిపారు. కెరీర్ గైడెన్స్ సెల్ అదనపు సభ్యుడు పెంచల ప్రసాద్ మాట్లాడుతూ పోటీ పరీక్షల సిలబస్, పరీక్షల సరళి, ప్రిపరేషన్ విధానం, అవసరమైన పుస్తకాలు తదితర అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు నిరంతర సాధన అవసరమని పేర్కొన్నారు.కళాశాల మహిళా సాధికారత కమిటీ సభ్యురాలు డాక్టర్ గౌతమి నాలెడ్జ్ షేరింగ్, చదువులో ప్రణాళికాబద్ధమైన ప్రిపరేషన్ ప్రాధాన్యతను వివరించారు. జేకేసీ కోఆర్డినేటర్ కామేశ్వరరావు కంప్యూటర్ పరిజ్ఞానం, ఆధునిక విధానాల్లో నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధత, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

**రిజిస్ట్రేషన్ ప్రక్రియ విఆర్ఓల ద్వారా కొనసాగుతుంది అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు: ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు**





**విశాఖ తూర్పు / పెన్ పవర్ సెప్టెంబర్ 28** విశాఖ తూర్పు నియోజకవర్గంలో మిగుల రెగ్యులరైజేషన్ పట్టాలు పంపిణీ కార్యక్రమం 9 10 వార్డులకు సంబంధించి అరవ లక్ష్మీ కల్యాణ మండపం లో పట్టాల పంపిణీ కార్యక్రమం వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన వారు విఆర్వోల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని,జీవో నెంబర్ 30 ని అనుసరించి వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన అన్నారు.పట్టాలు పొందిన వారు రెండు సంవత్సరములు గడిచిన అనంతరం క్రయవిక్రయాలు అది అవసరాలు మేరకు చేసుకోవచ్చునని అన్నారు. 9 10 వార్డులకు 357.620 పట్టాలు పంపిణీ కార్యక్రమం కార్యక్రమంలో ఆర్డిఓ సంగీత్ మాధుర్.ఎమ్మార్వో పాల్ కిరణ్. మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు.మద్దిల రాజశేఖర్.పార్టీ ఇంచార్జ్ బుడుమూరి గోవింద్.పోత్రకొండ ధర్మారావు.కాకి గంగరాజు. రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.వార్డు నెం. 9 & 10: మొత్తం 357 పట్టాలు. వేదిక: అరవ లక్ష్మి కమ్యూనిటీ హాల్, రవీంద్రనగర్.వార్డు నెం. 11:మొత్తం 620 పట్టాలు. వేదిక: రాధాకృష్ణ కళ్యాణ మండపం, తోటగరువు హైస్కూల్ పక్కన.లివార్డు నెం. 12 మొత్తం 289 పట్టాలు. వేదిక: రాధాకృష్ణ
ఈ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

# కళాశాలల్లో నేడు ఓటరు అవగాహన కార్యక్రమాలు

**కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు**



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు,పెన్ పవర్,సెప్టెంబర్ 28:** ఓటర్ల నమోదు, అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని అన్ని కళాశాలలు, విద్యాసంస్థల్లో మంగళవారం ప్రత్యేక ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల విభాగం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ఆయా కళాశాలలకు జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకంగా నియమించారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువత, తొలిసారిగా ఓటు హక్కు పొందనున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యంపై అవగాహన కల్పించనున్నారు. అర్హులైన విద్యార్థులతో అక్కడికక్కడే ఓటరు నమోదు దరఖాస్తు--6ను పూర్తి చేయించి, నూతన ఓటర్లుగా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కార్యక్రమ నిర్వహణపై అధికారులకు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు, సూచనలు అందజేశామని, వాటిని తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమం అనంతరం నిర్వహణకు సంబంధించిన నివేదికలు, ఛాయాచిత్రాలను జిల్లా ఎన్నికల విభాగానికి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 19 వినతులు

**సీసీ రోడ్లు, వర్ష నష్టాలపై ప్రజల అర్జీలు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**జీకే వీధి పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 19 వినతులు అందినట్లు ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు తెలిపారు. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణం, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, రోడ్లు, వంతెనల మరమ్మతులకు సంబంధించి ప్రజలు అర్జీలు సమర్పించారు.ప్రజల నుంచి వినతులను స్వీకరించి, సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్, ఎస్ఐ సురేశ్, పంచాయతీ కార్యదర్శి పాల్ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరించారు.

# దామనపల్లిలో జనసేన కదనభేరి..

**ఐక్యంగా పనిచేయాలని డాక్టర్ వంపూరు గంగులయ్య పిలుపు!**

**స్థానిక ఎన్నికలపై జనసేన శ్రేణులకు దిశానిర్దేశం**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్, అల్లూరి జిల్లా జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య సూచించారు.దామనపల్లి పంచాయతీ మాడెం గ్రామంలో అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ సారథ్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమై రానున్న స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ దామనపల్లి పంచాయతీలో జనసేన పార్టీకి ప్రజల నుంచి ఆదరణ ఉందని, దీనిని మరింత విస్తృతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జనసేన పార్టీ లక్ష్యాలు, విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు.నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో జీకేవీధి మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వాసుపరి ప్రసాద్, కొయ్యం ఇమ్మానుయేల్, సిద్దు, గబులంగి గణేష్, వంశీ, శ్రీను, ఈశ్వర్, గడుతూరి పరమేశ్వరరావు, మదల సతీష్, సిదరి రమణమూర్తి, వెంకటేష్, కూడా పల్లంనాయుడు, వంతల కాశీరాజు, సూర్ల వీరేంద్ర, కూడా రామకృష్ణ, చల్లంగి శ్రీను, దాసు, బురిడీ సరస్వతిరావు, సీనియర్ నాయకులు కొర్ర రాంబాబు, పాంగి దాసు, సుందర్, తగ్గి బాలరాజు, భీమశంకర్, గెమ్మెలి బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.



# బీచ్ రోడ్డుపై ఆకతాయిల హల్‌చల్!

- అర్ధరాత్రి బైక్ విన్యాసాలు.. వేగపు పోటీలతో రచ్చ
- రంగంలోకి త్రీటౌన్ పోలీసులు.. 46 వాహనాలు స్వాధీనం
- ఆర్కే బీచ్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో ప్రత్యేక తనిఖీలు
- ముగ్గురితో ప్రయాణించిన 20 వాహనాలు పట్టివేత
- మద్యం మత్తులో వాహనాలు నడిపిన 14 మంది
- పోలీసులను చూసి వాహనాలు వదిలి పరారీ
- నిఘా కెమెరాల దృశ్యాలతో పరారైన వారి గుర్తింపు
- రోడ్లపై రచ్చ చేస్తే ఉపేక్షించేది లేదన్న సీఐ అమ్మినాయుడు



**క్రైమ్ బ్యూరో పెన్ పవర్, విశాఖపట్నం సెప్టెంబర్ 28:** విశాఖ నగరంలోని ఆర్కే బీచ్ రోడ్డుపై అర్ధరాత్రి వేళ బైక్ విన్యాసాలు, వేగపు పోటీలతో హల్‌చల్ చేస్తున్న యువకులపై త్రీటౌన్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ప్రజల భద్రతకు ముప్పు కలిగించేలా వాహనాలు నడుపుతున్న వారిపై శనివారం, ఆదివారం రాత్రుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మొత్తం 46 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు త్రీటౌన్ సీఐ అమ్మినాయుడు, ఎస్సై ధనుంజయ్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆర్కే బీచ్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. అధిక శబ్దం వచ్చేలా మార్పులు చేసిన బైక్‌లతో ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న వారి 5 వాహనాలు, వాహనం నడిపేందుకు అనుమతిపత్రం లేని వారి 4 వాహనాలు, ముగ్గురితో ప్రయాణించిన 20 వాహనాలు, మైనర్లు నడిపిన 3 వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి 14 వాహనాలను పోలీసులు పట్టుకున్నారు.

**పోలీసులను చూసి వాహనాలు వదిలి పరార్**

పోలీసుల తనిఖీలను గమనించిన కొందరు యువకులు తమ వాహనాలను అక్కడే వదిలి పరారయ్యారు. వారిని గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని నిఘా కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పరారైన వారిని గుర్తించి వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

**పట్టుబడిన వారిలో యువకులే అధికం**

పట్టుబడిన వారిలో ఎక్కువ మంది 19 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న యువకులేనని సీఐ అమ్మినాయుడు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్ట నిబంధనల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పిల్లల ప్రవర్తన, వాహన వినియోగంపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

**సరదా కోసం ప్రాణాలతో చెలగాటం వద్దు**

యువకులు సరదా పేరుతో ప్రమాదకర బైక్ విన్యాసాలు, వేగపు పోటీలకు పాల్పడి తమ ప్రాణాలతో పాటు ఇతర ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని సీఐ హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తన, వాహన వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు.
రోడ్లపై ప్రజలకు ఇబ్బంది కలిగించేలా బైక్ విన్యాసాలు, వేగపు పోటీలు నిర్వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ అమ్మినాయుడు స్పష్టం చేశారు.

# శరణ్య ఉన్నత చదువులకు 'స్పెక్ట్' చేయూత

**ఏఐ కోర్సు విద్యార్థినికి రూ.26 వేల ఆర్థిక సాయం**

**చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానన్న కోలపల్లి ఉదయ సుందర్**

**దాతకు స్పెక్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి కృతజ్ఞతలు**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ అనకాపల్లి, సెప్టెంబర్ 28**
చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అమ్మమ్మ సంరక్షణలో పెరిగిన అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన శరణ్య ఉన్నత చదువులకు స్పెక్ట్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఆమె విద్యాభ్యాసానికి స్పెక్ట్ ట్రస్ట్ అడ్వైజర్ కోలపల్లి ఉదయ సుందర్ రూ.26 వేల ఆర్థిక సాయం అందించారు. శరణ్య ఇంటర్మీడియట్‌లో 972 మార్కులతో ప్రతిభ కనబరిచింది. అనంతరం పాయకరావుపేటలోని స్పేస్ డిగ్రీ కళాశాలలో ఏఐ కోర్సులో చేరింది. ఏడాదికి రూ.46 వేల ఫీజు చెల్లించాల్సి ఉండగా, ఆమె పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కళాశాల యాజమాన్యం రూ.10 వేల ఫీజు రాయితీ కల్పించింది. బెంగళూరుకు చెందిన దోర్నాల బిందు మాధవ్ అందించిన రూ.10 వేలను ఈ నెల 16న తొలి విడత ఫీజుగా చెల్లించారు. మిగిలిన రూ.26 వేల ఫీజు చెల్లింపు సమస్యగా మారిన నేపథ్యంలో శరణ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న స్పెక్ట్ ట్రస్ట్ అడ్వైజర్ కోలపల్లి ఉదయ సుందర్ స్పందించారు. అమెరికాలో ఉంటున్న ఆయన రూ.26 వేలను వెంటనే పంపించి శరణ్యకు అండగా నిలిచారు. అంతేకాకుండా శరణ్య ఎంతవరకు చదవాలనుకుంటే అంతవరకు ఆమె విద్యాభ్యాసానికి అవసరమైన సహాయం అందించే బాధ్యతను స్వీకరించినట్లు స్పెక్ట్ ప్రతినిధులు తెలిపారు.
ఉదయ సుందర్ గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి ప్రస్తుతం అందుతున్న పింఛన్‌లో గణనీయమైన భాగాన్ని నిరుపేద విద్యార్థుల చదువుల కోసం వెచ్చిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు.





ఆయన, ఆయన సతీమణి కమల గతంలో శరీర అవయవదాన ఉద్యమానికి కూడా సహకరించారని తెలిపారు. తమ సంపూర్ణ దేహదానానికి సంబంధించిన సమ్మతి పత్రాలను గాంధీ మెడికల్ కళాశాలకు సమర్పించినట్లు పేర్కొన్నారు. శరణ్య విద్యాభ్యాసానికి తక్షణమే ఆర్థిక సహాయం అందించడంతో పాటు భవిష్యత్తు చదువులకు అండగా ఉంటానని ముందుకొచ్చిన కోలపల్లి ఉదయ సుందర్‌కు స్పెక్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# సామాజిక సమరసత, జాతీయ భావనను బలోపేతం చేయాలి

**యువతకు గుర్రం జాషువా ఆలోచనలు స్ఫూర్తిదాయకం**

**సమానత్వం, సోదరభావం పెంపొందించాలి**

**ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**విశాఖపట్నం, పెన్ పవర్ సెప్టెంబర్ 28:**
సామాజిక సమరసత, జాతీయ భావన, దేశభక్తితో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి పట్ల సమానత్వ భావనను విద్యార్థులు, యువతలో పెంపొందించాల్సిన అవసరం ఉందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో "సమరసతా స్వరం... జాతీయతా గళం" సందేశంతో నిర్వహించిన గుర్రం జాషువా జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం, దేశం పట్ల బాధ్యతను పెంపొందించడంలో గుర్రం జాషువా ఆలోచనలు నేటితరానికి మార్గదర్శకంగా నిలుస్తాయని మాధవ్ అన్నారు. ముఖ్యంగా యువతలో జాతీయ స్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశానికి విశాఖపట్నం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరుశరామ రాజు అధ్యక్షత వహించారు.



బీజేపీ శాసనసభాపక్ష నేత పెన్మత్స విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, గుర్రం జాషువా ఆలోచనలను నేటితరం అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కార్తిక్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాతృ మరణంపై సమగ్ర విచారణ

**చిన్న గంగవరం గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి**

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం చిన్న గంగవరం గ్రామానికి చెందిన గర్భిణి పాంగి లావణ్య మృతి ఘటనపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎం. రియాజ్ బేగ్ సోమవారం సమగ్ర విచారణ చేపట్టారు. ఇటీవల తుపాను కారణంగా గ్రామానికి వెళ్లే మార్గంలోని వంతెన కొట్టుకుపోవడంతో వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు డీఎంహెచ్‌వో డాక్టర్ రియాజ్ బేగ్, జిల్లా ప్రజారోగ్య నర్సింగ్ అధికారి (డీపీహెచ్‌ఎన్‌ఓ) భూలోకమ్మతో కలిసి దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించిన అనంతరం చిన్న గంగవరం గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో మాతృ మరణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆశా కార్యకర్త నుంచి జిల్లా వైద్యాధికారి వరకు ప్రతి ఒక్కరిపై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడం, తప్పుడు నివేదికలు సమర్పించడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. గర్భిణులు ప్రసవానికి ముందుగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రసవ నిరీక్షణ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతికూల పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకుని అవసరమైన వైద్య సేవలను పొందేందుకు కుటుంబ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి త్వరలో ఇద్దరు నూతన వైద్యాధికారులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వార్డు బాయ్, ఆయా పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. స్థానికంగానే గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడతామని తెలిపారు. అంబులెన్స్ మరమ్మతు సమస్యను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ భూలోకమ్మ, దారకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. బాబ్జి, హెల్త్ సూపర్‌వైజర్లు బి.వి.ఎం. రాణి, రాజులమ్మ, ఏఎన్‌ఎంలు దేవి, నాగమణి, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## 22ఏ జాబితాలో ప్రైవేటు భూముల చిక్కులు

**నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలి**

**మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు డిమాండ్**



**విశాఖ తూర్పు, పెన్ పవర్ సెప్టెంబర్ 28:** ప్రైవేటు వ్యక్తులకు చెందిన భూములు, ఇళ్లు నిషేధిత ఆస్తుల 22ఏ జాబితాలో ఉండటంతో యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సెంటర్ ఫర్ లిబర్టీ చైర్మన్, మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అర్హమైన ప్రైవేటు ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖపట్నంలోని పలు ప్రాంతాలకు చెందిన బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. ప్రైవేటు భూములు, నివాస గృహాలకు సంబంధించిన కొన్ని సర్వే నంబర్లు 22ఏ జాబితాలో ఉండటం వల్ల వాటి యజమానులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్న ఆస్తులు నిషేధిత జాబితాలో ఉండటంతో క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయని బాధితులు పేర్కొన్నారు. సంబంధిత భూ రికార్డులు, యాజమాన్య పత్రాలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రైవేటు భూములు, ఇళ్ల సర్వే నంబర్లను 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరారు. ఈ విషయంలో అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏబీ వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో మురళీనగర్, మద్రిపాలెం, మధురవాడ, అక్కిరెడ్డిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన బాధితులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులపై నిర్బంధం ఆపాలి: సీఐటీయూ

**న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**అరెస్టులు, కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్**




**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళనకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఉద్యోగులపై నిర్బంధ చర్యలను నిలిపివేసి, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు కోరారు. సచివాలయ ఉద్యోగులకు మద్దతుగా సోమవారం సాయంత్రం విశాఖలోని జగదాంబ సీఐటీయూ కార్యాలయం నుంచి జగదాంబ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలను చేరవేయడంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు, పెండింగ్ బకాయిల చెల్లింపు, పని భారం తగ్గింపు తదితర అంశాలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. విజయవాడలో ఆదివారం జరిగిన సచివాలయ ఉద్యోగుల ఆందోళన సందర్భంగా పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో నోషనల్ ఇంక్రిమెంట్లు, పెండింగ్ బకాయిలు, పదోన్నతి అవకాశాలు ఉన్నాయి.
విజయవాడలో నిరసన సందర్భంగా విధుల్లో ఉన్న నున్న సీఐ అహ్మద్ అలీ ఆకస్మికంగా మృతి చెందిన ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదైన నేపథ్యంలో, ఆ కేసును సచివాలయ ఉద్యోగుల నాయకులతో ముడిపెట్టే ప్రయత్నం జరుగుతోందని నరసింగరావు ఆరోపించారు. ఈ అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. అరెస్టయిన ఉద్యోగులను విడుదల చేయడంతో పాటు ఉద్యోగులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఉద్యోగుల సమస్యలపై చర్చలు జరిపి పరిష్కారం చూపాలని, ఆందోళన చేస్తున్న సచివాలయ సిబ్బందికి సీఐటీయూ అండగా ఉంటుందని నరసింగరావు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులతో పాటు సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి.మణి, యు.రాజు, పి.వెంకట్రావు, టి.నూకరాజు, ఎం.సుబ్బారావు, సుభాషిణి, కుమారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి మహిళల పెన్షన్ వయోపరిమితి తగ్గించాలి

**35 ఏళ్లకే పెన్షన్ అమలు చేసిన జీవోను కొనసాగించాలి**

**మాజీ సర్పంచ్ పాంగి దుర్జో**

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** ఒంటరి మహిళల పెన్షన్‌కు ప్రస్తుతం విధిస్తున్న 50 ఏళ్ల వయోపరిమితిని తగ్గించి, గతంలో అమల్లో ఉన్న విధానాన్ని కొనసాగించాలని సీలేరు గ్రామ తాజా మాజీ సర్పంచ్ పాంగి దుర్జో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 35 ఏళ్లు నిండిన ఒంటరి మహిళలకు పెన్షన్ మంజూరు చేసే విధానం అమల్లో ఉండేదని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి, ఒంటరి మహిళలకు 50 ఏళ్లు నిండి ఉండాలనే నిబంధన విధిస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. దీంతో అర్హత ఉన్నప్పటికీ పలువురు ఒంటరి మహిళలు పెన్షన్ పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇందుకు ఉదాహరణగా సీలేరు గ్రామానికి చెందిన మసీదు లైన్ రత్నమణికి 46 ఏళ్లు నిండి, ఒంటరి మహిళ ధ్రువీకరణ పత్రం ఉన్నప్పటికీ ప్రస్తుత నిబంధనల కారణంగా పెన్షన్‌కు నమోదు చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒంటరి మహిళల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని 50 ఏళ్ల వయోపరిమితి నిబంధనను పునఃపరిశీలించాలని, గతంలో 35 ఏళ్లకే పెన్షన్ అందించే విధానాన్ని కొనసాగించాలని పాంగి దుర్జో కోరారు. దీనివల్ల పెన్షన్‌కు అర్హులైన మరెంతో మంది ఒంటరి మహిళలకు ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు.



# ఎంవోయూలు కాగితాలకే పరిమితం కాకూడదు

**పెట్టుబడి ప్రాజెక్టులను త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలి**

**భూకేటాయింపులు, అనుమతుల్లో జాప్యం లేకుండా చర్యలు**

**స్పందన లేని ఎంవోయూలపై నివేదిక ఇవ్వాలి**

**అధికారులకు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశం**



**విశాఖపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** విశాఖపట్నం జిల్లాలో వివిధ రంగాల్లో కుదిరిన అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కాగితాలకే పరిమితం కాకుండా, ప్రతిపాదిత పెట్టుబడి ప్రాజెక్టులు త్వరగా కార్యరూపంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఎంవోయూల అమలు, ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఐటీ, పర్యాటకం, పరిశ్రమలు, చేనేత తదితర రంగాల్లో ప్రతిపాదించిన ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భూకేటాయింపులు, స్థల పరిశీలన, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు), వివిధ శాఖల అనుమతుల స్థితిపై ఆరా తీశారు.ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖలు సమన్వయంతో వాటిని పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ అంశాలను వేగంగా పూర్తి చేసి ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పెట్టుబడిదారులతో అధికారులు నిరంతరం సంప్రదింపులు జరపాలని, స్పందన లేని ఎంవోయూల పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెరిగేలా, తద్వారా జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఏపీఐఐసీ జెడ్ఎం సింహాచలం, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆముక్త, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి మాధవి, డివిజనల్ మేనేజర్ జగదీష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు తదితర అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**పీజీఆర్ఎస్‌లో వచ్చిన 280 వినతులపై క్షేత్రస్థాయి పరిశీలన**

**జల జీవన్ మిషన్ పనులు పూర్తిచేయకపోతే కాంట్రాక్టుల రద్దు**

**ప్రమాదకర పాఠశాల భవనాల కూల్చివేత బుధవారంలోగా పూర్తి చేయాలి**

**రోడ్డు ప్రమాదాల నివారణకు కూడళ్లు, మలుపుల వద్ద భద్రతా చర్యలు**

**అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు**



అనకాపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 28: జిల్లాలో గ్రామీణాభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని మండలాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి మండల అభివృద్ధి అధికారులు, ఉప మండల అభివృద్ధి అధికారులు, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, విద్యుత్, డీఆర్‌డీఏ, డీపీఓ, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించారు.

**280 వినతులపై క్షేత్రస్థాయి పరిశీలన**

పీజీఆర్ఎస్‌లో అందిన 280 వినతులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సమస్యలకు ఏఓ, నీటిపారుదలకు ఏఈ, పారిశుద్ధ్యానికి డిప్యూటీ ఎంపీడీఓ, తాగునీటి సమస్యలకు సంబంధిత ఏఈ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

వరి పంటలను బీమా పరిధిలోకి తీసుకురావడంతో పాటు బీమా పరిధిలోకి రాని పంటలకు పీఎండీఎస్ విధానం ద్వారా సహజ వ్యవసాయ నిపుణుల సహకారంతో రక్షణ కల్పించాలని సూచించారు. గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేసిన విగ్రహాల వ్యర్థాలను తొలగించి, ఐదు రోజుల్లో చెరువులను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

**ప్రతి నెలా మొదటి తేదీ 'సంక్షేమ దినోత్సవం'**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మొదటి తేదీని 'సంక్షేమ దినోత్సవం'గా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఉదయం పింఛన్ల పంపిణీ పూర్తి చేసి, మధ్యాహ్నం ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఐవీఆర్ఎస్ అభిప్రాయాలు, పీజీఆర్ఎస్ సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో నేరుగా మాట్లాడాలని సూచించారు. అధికారులు స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడం ద్వారా యంత్రాంగంపై నమ్మకం పెరుగుతుందన్నారు.

గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో చేపడుతున్న రూ.200 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు**

ప్రమాదకరమైన రోడ్డు కూడళ్లు, మలుపుల వద్ద అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో లైట్ల ఏర్పాటుకు ఈఈ, పంచాయతీరాజ్ అధికారులు అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు. మండల పరిషత్ నిధులతో సైన్‌బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓలకు సూచించారు.ప్రమాదకరంగా మారిన పాత, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల కూల్చివేతను బుధవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**జల జీవన్ మిషన్ పనుల్లో జాప్యం వద్దు**

జల జీవన్ మిషన్ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, ఇప్పటివరకు జిల్లాలో కాంట్రాక్టర్లకు రూ.67 కోట్ల విలువైన బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఎంపీడీఓలు కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలను రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమావేశంలో డీపీఓ, డ్వామా పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, డీఆర్‌డీఏ, నీటిపారుదల, విద్యుత్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం మున్సిపాలిటీలో ఓట్ల గజిబిజి

## ఆర్డిఓ కు ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే గణేష్



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 28) :** నర్సీపట్నం మున్సిపాలిటీలో ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఉదయం మున్సిపాలిటీ పార్టీ నాయకులతో కలిసి ఆర్డీఓ వి.వి. రమణకు వినతిపత్రం అందజేశారు.అనంతరం గణేష్ మీడియాతో మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని వార్డుల విభజన, ఓటర్ల జాబితా తయారీలో అధికారులను ఇష్టారాజ్యంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. వార్డుల మధ్య ఓటర్ల సంఖ్యలో 10 శాతానికి అటు ఇటుగా మాత్రమే వ్యత్యాసం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. వార్డుల విభజన సమయంలోనే ఓటర్లను బట్టి హద్దులు నిర్ణయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, ముందుగానే తమ పార్టీ నాయకులు వినత పత్రాలు ఇచ్చినా మున్సిపల్ కమిషనర్ వాటిని పరిగణలోకి తీసుకోకపోవడం విచారకరమన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలపై ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించినట్లు గణేష్ తెలిపారు. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న చర్యలు ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో మీడియా ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివప్రసాద్, కోనేటి రామకృష్ణ, చింతకాయల వరుణ్, మల్ల గణేష్, తమరాన శ్రీనివాసరావు, సుర్ల నాయుడుబాబు, మాకిరెడ్డి బుల్లిదొర, దాడి బుజ్జి, యాదగిరి శేషు, జగదీశ్వరి, అల్లంపల్లి లావణ్య, శారద తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ**

**ప్రతి సోమవారం సమస్యల పరిష్కార వేదిక**



**భీమునిపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 28:** ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని భీమిలి ఆర్డీఓ కె. సంగీత్ మధుర్ సూచించారు.

భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ స్థాయి అధికారులు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం నాలుగు ఫిర్యాదులు అందాయి.ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చేందుకు పీజీఆర్ఎస్ ఉపయోగకరమైన వేదికగా ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భీమిలి డివిజన్ పరిధిలో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## పాలకులు పట్టించుకోలేదు.. ప్రకృతి కరుణించలేదు. గంధాలవీధికి తప్పని రహదారి కష్టాలు.

**భరోసా ఇచ్చిన జనసేన నాయకులు.**



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 28.** ఏజెన్సీ ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కొమ్మంగి పంచాయతీ పరిధిలోని గంధాలవీధి గ్రామస్తులకు తీరని కష్టాన్ని మిగిల్చాయి. ఏడు దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి గురై, విసిగిపోయి తమకు తాముగా నిర్మించుకున్న రహదారి కాస్తా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో ఆ గ్రామస్తుల పరిస్థితి దయనీయంగా మారింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మన్యంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలో రౌరింతాడ నుంచి సల్లాయి, గెంజిగెడ్డ వైపు వెళ్లే ప్రధాన రహదారి నుంచి గంధాలవీధికి వెళ్లే మార్గంలో ఉన్న రెండు పైపుల కల్వర్టులు (తూరల వంతెనలు) వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. రహదారి భారీగా కోతకు గురికావడంతో గంధాలవీధి గ్రామానికి రాకపోకలు కష్టమయ్యాయి. గంధాలవీధి గ్రామం ఏర్పడి 70 ఏళ్లు గడుస్తున్నా నేటికీ కనీస రహదారికి నోచుకోలేదు. ప్రభుత్వాలు, పాలకులు ఎంతమంది మారినా తమ తలరాత మారకపోవడంతో గ్రామస్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయిన వీరు.. ఇంటింటికీ చందాలు వేసుకుని, శ్రమదానంతో సొంతంగా ఒక మోస్తరు రోడ్డును నిర్మించుకున్నారు. కనీసం ఆ రోడ్డయినా మిగులుతుందనుకుంటే, తీరా ఇప్పుడు వర్షాలకు ఆ రోడ్డు, కల్వర్టులు కూడా కొట్టుకుపోవడంతో కన్నీరుమున్నీరు అవుతున్నారు. నిత్యావసరాలు తెచ్చుకోవాలన్నా, బడికి వెళ్లే పిల్లలైనా, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులైనా సరే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈ దారి గుండా నరకయాతన అనుభవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల వినతి మేరకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో నాయకుల బృందం శనివారం దెబ్బతిన్న మార్గాన్ని పరిశీలించింది. ఏఎంసీ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు వంతల సుబ్బారావు ఇతర నాయకులు గ్రామస్తులతో మాట్లాడి వారి గోడును విన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. గంధాలవీధి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించేలా తమవంతు కృషి చేస్తామని, అప్పటివరకు ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పోటుకూరి జయరాజు, మాజీ సర్పంచ్‌లు పాంగి వంశీకృష్ణ, వంతల సత్యనారాయణ, కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ పాంగి కృష్ణ, స్థానిక నాయకులు గసాడి దిలీప్ కుమార్, పాంగి శ్రీనివాస్, గెమ్మెలి పాల్స్, గుంట కోటి, మొటడం బాలరాజు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## "ఉదారత" స్వభావాన్ని చాటుకున్న "108 సిబ్బంది"...!

**గిరిజన మహిళకు అత్యవసర సమయంలో పురుడుపోసిన 108 సిబ్బంది**



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 28:** అత్యవసర సమయంలో గిరిజన మహిళకు పురుడు పోసి తమ ఉదారత స్వభావాన్ని చాటుకున్న 108 సిబ్బంది. మండలంలోని బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని కన్నవరం గ్రామానికి చెందిన గెమ్మెల సుజాత పురిటి నొప్పులుతో బాధపడటంతో 108 సిబ్బందికి తెలియపరిచారు దీనితో 108 సిబ్బంది హుటాహుటిన కన్నవరం చేరుకొని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది చింతవానిపాలెం మార్గమధ్యలో పురుడు పొయ్యగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీనితో ఆమెకు మెరుగైన వైద్యం కొరకు రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తమ ఉదారత స్వభావాన్ని చాటుకున్న ఈఎంటి డి. ఈశ్వరరావు, పైలెట్ వినోద్ కుమార్ లకు సుజాత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చదువుకున్న పాఠశాలకు విద్యార్థుల అపూర్వ కానుక

**రూ.18 వేల విలువైన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం అందజేత**



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 28) :** తాము చదువుకున్న పాఠశాలపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెట్టుపల్లికి 2025--26 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు అపూర్వ కానుక అందించారు. తమ స్వంత ఆర్థిక సహకారంతో సుమారు రూ.18,000 విలువైన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని పాఠశాలకు అందజేశారు. ఈ విగ్రహాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి. సరోజిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక స్పృహను అలవరుచుకోవడం అభినందనీయమన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేయడం ద్వారా భవిష్యత్ తరాల విద్యార్థులకు స్ఫూర్తి కలుగుతుందని అన్నారు. పాఠశాలపై విద్యార్థులకు ఉన్న అనుబంధానికి ఈ కార్యక్రమం నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. తమ స్వంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేసి పాఠశాలకు అందించడం ద్వారా విద్యార్థులు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల ఔదార్యాన్ని గ్రామస్తులు, పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద ఫోటోలు దిగారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com